ఓటు హక్కు విలువైనది

ఓటర్లూ.. ఈరోజు మీదే.. ఐదేండ్లకోసారి వచ్చే ఈ రోజును సద్వినియోగం చేసుకోండి. మీ సత్తా చాటండి.. మీ వద్ద ఉన్న ఓటు ఆయుధాన్ని సంధించండి. స్వార్థ చింతన.. స్వలాభం చూసుకునే నాయకులను దూరం పెట్టండి.. ఓటేసే ముందు ఒక్క నిమిషం ఆలోచించండి.. డబ్బులు ఇచ్చాడనో.. మద్యం తాగించాడనో.. ఐదేండ్ల కాలాన్ని వారి చేతిలో పెట్టొద్దు... మనకు ఎవరైతే న్యాయం చేస్తారో.. సమాజాన్ని బాగు చేస్తారో.. వారికే ఓటేసి తలరాతను మార్చుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. ఓటర్ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

- నిర్భయంగా ఓటేద్దాం.. నవ సమాజాన్ని నిర్మించు కుందాంమని ప్రజాప్రతినిధులు, అధికారులు
- విద్యార్థులతో ర్యాలీలు, ప్రతిజ్ఞలు
- ఓటు హక్కుపై అవగాహన కల్పించిన అధికారులు, ఉపాధ్యాయులు

పరిగి: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఆర్‌డీవో వాసుచంద్ర

కొడంగల్ :ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పరిగి, జనవరి 25 : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం పరిగిలో నిర్వహించిన ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వికారాబాద్ ఆర్‌డీవో వాసుచంద్ర, పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో కరీం, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు మనందరి బాధ్యత

కొడంగల్ : ఓటు హక్కు పొందడం మనందరి బాధ్యతగా గుర్తించి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును పొంది ఉండాలని కొడంగల్, దుద్యాల తహసీల్దార్లు విజయ్‌కుమార్, కిషన్, ఎంపీడీవో ఉషశ్రీ పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల, దౌల్తాబాద్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వృద్ధులైన ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ధారూరు : భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షాజీదాబేగం తెలిపారు. శనివారం ధారూరు మండల పరిధిలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

పెద్దేముల్ : ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎంఈవో నర్సింగ్‌రావుతో కలిసి పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దేముల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయు లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై నినాదాలు

బషీరాబాద్ : ఓటు చాలా విలువైనదని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేశ్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటు నమోదుపై నినాదాలు ఇచ్చారు.కార్యక్రమంలో ఎస్సై శంకర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు..

దోమ : ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు ఆయుధం లాంటిదని తహసీల్దార్ పురుషోత్తం ఎంపీడీవో మహేశ్ బాబు అన్నారు. దోమ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఎంఈవో వెంకట్, ఎంపీవో సోమలింగం, డీటీ నర్సింహులు, పర్యవేక్షకుడు నరేందర్, కార్యాలయ సి బ్బంది యాదయ్య, వెంకటేశ్, అనసూయ, పద్మావతమ్మ, ఉమ, సురేశ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కులకచర్ల : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని హసీల్దార్ మురళీధర్, ఎంఈవో అబీబ్‌హైమద్ అన్నారు. శనివారం కులకచర్ల మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయితీగా ఓటు వేయాలి

మర్పల్లి : 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో రాజమల్లయ్య, నాయబ్ తహసీల్దార్ పరశురాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ఓటు ఎంతో విలువైందని ఓటును అమ్ముకోకుండా నిజాయతీగా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు మాధవరెడ్డి, వెంకటేశం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..

మున్సిపల్ చైర్మన్ అశోక్, కౌన్సిలర్లను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండాలి

పరిగి, జనవరి 25 : ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. పదవీ కాలం ముగియనున్న మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, కౌన్సిలర్లకు శనివారం పరిగిలోని పుర పాలక సంఘం కార్యాలయం ఆవరణలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాసేవలో నిస్వార్థంగా పనిచేసిన వారిని ప్రజలు ఎల్లప్పుడు గుర్తుంచుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, వైస్ చైర్‌పర్సన్ ప్రసన్నలక్ష్మి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిగి అభివృద్ధికి కృషి

అయిదేండ్ల కాలంలో పాలకవర్గం పరిగి పట్టణాభివృద్ధికి విశేష కృషి చేసిందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కొనియాడారు. పదవీకాలం పూర్తికానున్న మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, కౌన్సిలర్లను శనివారం తమ నివాసంలో మాజీ ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రధాన రహదారుల విస్తరణతో పరిగి రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. పదవీకాలం ముగిసినా ప్రజాసేవలో ఎల్లపుడు ఉండాలన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి

నవాబుపేట, జనవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వాటిని కప్పి పుచ్చుకోవడానికే అధికారులతో గ్రామసభలు అంటూ కాలయాపన చేస్తున్నదని బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు అంతమోళ్ల దయాకర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నవాబుపేట కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేస్తున్న కాలయాపన పరిపాలనపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి మాణిక్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మహేశ్‌రెడ్డి, కోశాధికారి జగన్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ సంతోశ్‌రెడ్డి, సోషల్ మీడియా శేఖర్, నగేశ్, కుమార్, ఎస్సీ సెల్ సంతోశ్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

◆ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ◆ మోమిన్‌పేట అభివృద్ధి పనులు ప్రారంభం

మల్‌రెడ్డిగూడలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జనవరి 25 : అర్హులందరికీ సంక్షేమ పథకాల్లో లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం మోమిన్‌పేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద 42 మంది లబ్ధిదారులకు రూ.42,04,873 విలువ చేసే చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 19 మంది లబ్ధిదారులకు రూ.8.20లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. రూ.1.69 కోట్లతో నాబార్డు వారి ఆర్థిక సహాయంతో నిర్మాణం చేపట్టిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం, కార్యాలయాన్ని స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోమినిపేట్ మండలానికి రూ.44.56కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. వికారాబాద్ నియోజక వర్గానికి 12 వేల ఇండ్లు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం మల్లారెడ్డి గూడ, చక్రంపల్లిల్లో రూ.20 లక్షల చొప్పున నిర్మించే పంచాయతీల భవన నిర్మాణ పనులకు స్పీకర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఉమ్మడి రంగారెడ్డి డీసీసీబీ అధ్యక్షుడు కొత్త కురుమ సత్తయ్య, డైరెక్టర్ అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, జిల్లా సహకార అధికారి నాగలింగా చారి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీవో విజయలక్ష్మి, సీఈవో శేఖర్, హెల్ప్ ఆల్ సొసైటీ చైర్మన్ సుందర్ పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

తాండూరు, జనవరి 25: తాండూరు మున్సిపల్ చివరి కౌన్సిల్ సమావేశం శనివారం రసాభాసగా జరిగింది. ఎమ్మెల్యే మనోహర్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీపతో పాటు కౌన్సిలర్లు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. కౌన్సిల్‌లో 38 అంశాలపై చర్చించారు. 35 అంశాలకు అందరూ ఆమోదం తెలుపగా 3 అంశాలపై ప్రతిపక్ష నేతలు వ్యతిరేకించారు. దీంతో కౌన్సిల్ కాసేపు గందరగోళంగా నడిచింది. బీఆర్ఎస్ నేతలు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పాలనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఐదేండ్ల పాలనలో తాండూరును ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కౌన్సిల్ సమావేశంలో తమకు మాట్లాడనియ్యక పోవడం విడ్డూరమన్నారు. అందుకు మాతముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరుకు ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అన్ని విధాల అభివృద్ధి చేసి రూపురేఖలు మారుస్తామన్నారు. చిలుకవాగు అభివృద్ధికి రూ.16 కోట్లు కేటాయించగా పూర్తి ప్రక్షాళన అనంతరం మరో రూ.25కోట్లకు టెండర్లు వేస్తున్నట్లు తెలిపారు. రూ.10 కోట్లతో గొల్ల చెరువు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అమృత్ 2.0 ద్వారా మంజూరైన రూ. 27 కోట్ల నిధులతో కాలనీల్లో మంచి నీటి ట్యాంకులు ఇతర పనులు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న మాట్లాడుతూ ఐదేండ్ల పాలనలో తమకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ మూత ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

బడిబయట ఉన్న పిల్లలను చేర్పించాలి

కులకచర్ల, జనవరి 25 : బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ముజాహిద్‌పూర్ క్లస్టర్ సీఆర్పీ రాజు అన్నారు. కులకచర్ల మండల పరిధిలోని బోట్యనాయక్‌తండాలో బడికి వెళ్లకుండా ఉన్న వి రోహిత్ అనే విద్యార్థితో మాట్లాడి బడిలో జాయిన్ చేయించినట్లు తెలిపారు. బడీడు పిల్లలను తప్పని సరిగా బడికి పంపించాలన్నారు. కార్యక్రమంలో బోట్యనాయక్‌తండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయవర్ధన్,ఉపాధ్యాయులు సంతోశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి ఎద్దడి నివారణకు చర్యలు

మర్పల్లి, జనవరి 25 : గ్రామంలో మంచి నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ అన్నారు.. శనివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి కాలనీలో బోరుమోటరు మరమ్మతుకు చేరుకోవడంతో కొత్తది కొనుగోలు చేసి బిగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు సర్వేశ్, లాయర్ మోహన్ రెడ్డి, వాటర్‌మెన్ క్రాంతి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

నూతన కమిటీకి నియామక పత్రాన్ని అందజేస్తున్న మండల అధ్యక్షుడు బందయ్య

దోమ, జనవరి 25 : దోమ మండల పరిదిలోని బొంపల్లిలో ఎమ్మార్పీస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ యువకులతో కలిసి శనివారం దోమ మండల అధ్యక్షుడు బందెయ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా మల్లేశ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాస్, రాములును, కోశాధికారిగా మహేశ్‌ను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు తెలిపారు. ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేశారు. ఫిబ్రవరి 7న నిర్వహించనున్న వేయి గొంతులు...లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా కమిటీలు కృషి చేయాలని అధ్యక్షుడు కోరారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హమాలీ సంఘం సభ్యుల సేవలు అభినందనీయం

హమాలీ సంఘం సభ్యులను సన్మానిస్తున్న పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్

కులకచర్ల, జనవరి 25: హమాలీ సంఘం సభ్యుల సేవలు అభినందనీయమని పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. శనివారం కులకచర్లలోని వివేకానంద విగ్రహం దగ్గర ఉన్న మెట్లు ఇటీవల కూలిపోవడంతో కులకచర్ల హమాలీ సంఘం సభ్యులు రిపబ్లిక్ డేకు ఒక రోజు ముందుగానే మరమ్మతులు చేయించి వివేకానంద విగ్రహం చుట్టూ పందులు తిరగకుండా జాలీ వేయించారన్నారు. వారి సే వలను గుర్తించిన ఆయన హమాలీ సంఘం సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాలె కృష్ణయ్యగౌడ్, బాలకృష్ణ, శ్రీనివాస్, రవి, హరికృష్ణ, హమాలీ సంఘం నాయకులు శివాజీ, చాపల రమేశ్, హమాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కులకచర్ల, జనవరి 25 : వివాహిత అదృశ్యమైన ఘటన చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్‌లో జరిగింది. కులకచర్ల ఎస్సై అన్వేశ్ రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కావలి అంజయ్య గురువారం పనికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వస్తే భార్య షేక్‌పల్లి గీత (27) కనిపించలేదు. వెంటనే ఆయన అత్తను గీత ఎక్కడికెళ్లిందని అడుగగా ఆరోగ్యం బాగా లేనందున కులకచర్లకు వెళ్లిందని చెప్పడంతో తిరిగి పనికి వెళ్లాడు. సాయంత్రం వరకు రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★Wanted Reg. clear Plot 300 Sq.yards Moinabad, Chevella. Genuine Seller may Contact: USA WhatsApp: 8153429593.
NT-337385

WANTED

★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గుర్తు తెలియని అడవి జంతువు దాడిలో జింక మృతి

దోమ, జనవరి 25 : గుర్తు తెలియని అడవి జంతువు దాడిలో జింక మృతి చెందిన ఘటన దోమ మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో జరిగింది. ఈ విషయాన్ని శనివారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని జింక చిరుత పులి లేదా హైనా దాడిలో మృతి చెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొలాల దగ్గర లేగదూడలు, గేదె పిల్లలను రైతులు తగిన రక్షణలో కట్టివేసి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మృతి చెందిన జింకను అధికారులు తీసుకెళ్లారు.

విద్యార్థులకు బెల్టుల పంపిణీ

గూడూరు పాఠశాలలో విద్యార్థులకు టై,బెల్టులను పంపిణీ చేస్తున్న యువకుడు రమేశ్

దోమ,జనవరి 25 : దోమ మండల పరిదిలోని గూడూరు అప్పర్ ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామ యువకుడు డప్పు రమేశ్ శనివారం టై, బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, జ్యోతి, ఉమాదేవి, మాధవి, మౌనిక, గ్రామ యువకులు మహేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962

యాలాలలో..

దోమలో..

నవాబుపేటలో..

జిల్లాల్లోని యాలాల, దోమ, నవాబుపేటలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పోలీసు అధికారులు ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. - యాలాల, దోమ, నవాబుపేట, జనవరి 25